క్లుప్తంగా...

ఘనంగా గోదాదేవికి పూజలు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎస్సీఎల్ సౌత్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అండాల్ తిరు నక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటలకు గోదాదేవి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

ప్రజావాణిలో పది ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఉప కమిషనర్ నరసింహ

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 10 ఫిర్యాదులు వచ్చాయి. ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన సమావేశంలో టౌన్ ప్లానింగ్‌కు ఒకటి, ఇంజనీరింగ్–2, శానిటేషన్ ఒకటి ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపారు. అదే విధంగా గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు రాగా అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగంపై ఐదు ఫిర్యాదులు, ఇంజనీరింగ్ ఒకటి వచ్చింది. వారం రోజుల్లో ఫిర్యాదులు పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాచుపల్లిలో పీర్లకు నూతన భవనం



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో నూతన పీర్ల భవనం, ఈద్గా దాత వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారాయణ, కాసాని వీరేష్, కాసాని సుధాకర్, ఎస్ఎంసీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సయ్యద్ కలీల్‌ఖాన్, ఎస్ఎంసీ మైనార్టీ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ షకీల్, సయ్యద్ ఫారూఖ్, సయ్యద్ షకీల్, సయ్యద్ సలీమ్, సయ్యద్ అక్బర్, మొహమ్మద్ ఖాజా, మొహమ్మద్ చాంద్‌పాషా పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



పొగుల తరుణ్ (ఫైల్)

సుభాష్‌నగర్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్‌కానిగూడ సుప్రియ ఎంపైర్ అపార్ట్‌మెంట్‌లో ఉండే వెంకటరమణ కుమారుడు పోగుల తరుణ్ శనివారం మధ్యాహ్నం తన కారులో బయటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్ వచ్చింది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం సూరారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ రామలింగచారికి గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు



ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత, అయోధ్య బాలరాముని స్వర్ణ పాదుకల రూపశిల్పి డాక్టర్ బ్రహ్మశ్రీ పిట్టంపల్లి రామలింగచారిని గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరించారు. తెలుగు సాంస్కృతిక సాహితీ సేవా ట్రస్ట్ ఇంటర్నేషనల్ అవార్డు బెంగళూర్ ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ మాచవరం గౌరిశంకర్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రావు శర్మ, స్థపతి తదితరులు పాల్గొన్నారు.

ఇవి రోడ్లేనా..?



నిజాంపేట్‌లో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



నిజాంపేట్ రోడ్డు దుస్థితి

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో వరుస ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ప్రభుత్వం ఓ వైపు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ రోడ్ల మరమ్మతులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు సైతం ప్రమాదాలకు నిలయంగా మారాయి. అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లోని రోడ్లకు మరమ్మతులు చేయించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. గుంతల కారణంగా వాహనాల వేగం తగ్గి ట్రాఫిక్ జామ్ అవుతోంది.



జగద్గిరిగుట్టలోని మెయిన్ రోడ్డుపై తేలిన రాళ్లు, కంకర



బాచుపల్లి రోడ్డు దుస్థితి



బాచుపల్లి నుంచి మియాపూర్ వెళ్లే రోడ్డుపై గుంతలు

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఏఈ స్వాతి, నారాయణ, వెంకట్

రంగారెడ్డినగర్: శిథిలమైన డ్రైనేజీ లైన్‌ను పునరుద్ధరించి రోడ్డు పనులను ప్రారంభించడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్‌గాంధీనగర్– జగద్గిరిగుట్ట రోడ్డులో తరచూ డ్రైనేజీ పొంగి పారుతుండటంతో రోడ్డు శిథిలమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో నెల రోజుల క్రితం కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. దీంతో జగద్గిరిగుట్ట, ఐడీపీఎల్ మీదుగా బాలానగర్‌కు వెళ్లే వాహనదారులను గాంధీనగర్ రోడ్డు మీదుగా దారి మళ్లించారు. దీంతో ఈ ప్రాంతం రద్దీగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సీసీ రోడ్డు పనులను ఏఈ స్వాతితో కలిసి సంజయ్‌గాంధీనగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణ, వెంకట్ సోమవారం ప్రారంభించారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఏఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్తీ ఉపాధ్యక్షుడు కిరణ్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

రోడ్డా.. బస్సుల పార్కింగ్ అడ్డా?



రోడ్డుకు అడ్డంగా బస్సులను నిలిపిన డ్రైవర్లు

జీడిమెట్ల: జీడిమెట్ల డిపో బస్సులను రాత్రిపూట రోడ్డుకు అడ్డంగా నిలపడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఇదే విధంగా జరుగుతుండటంతో ఎస్ఆర్.నాయక్‌నగర్, అపురూపకాలనీ, జనప్రియ, మోడీ అపార్ట్‌మెంట్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినిత్యం రాత్రి 10.30గంటల తర్వాత జీడిమెట్ల డిపోనకు చెందిన బస్సులను డ్రైవర్లు డిపోలో పార్కింగ్ చేస్తారు. డిపోలోకి బస్సులను తీసుకెళ్లే క్రమంలో డ్రైవర్లు క్యూ పద్ధతి పాటించకుండా ఒకరిని మించి ఒకరు డిపో లోపలికి వెళ్లేందుకు బస్సులను రోడ్డుకు అడ్డంగా ఇరువైపులా నిలుపుతున్నారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి డ్రైవర్లు క్యూపద్ధతిలో బస్సులను పార్కింగ్ చేసేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

13న చేయూత పెన్షన్‌దారుల మహా గర్జన



మాట్లాడుతున్న వాసుదేవరావు మాదిగ

సుభాష్‌నగర్: చేయూత పెన్షన్‌దారులు వచ్చేనెల 13న నిర్వహించనున్న చేయూత పెన్షన్‌దారుల మహా గర్జనను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి వాసుదేవరావు మాదిగ పిలుపునిచ్చారు. సూరారంలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, హెచ్ఐవీ బాధితులు పెన్షన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.4 వేలు, రూ.6 వేల పింఛన్‌ను వచ్చేనెల మొదటి వారంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం హామీని నిలబెట్టుకోకుంటే పింఛన్‌దారులతో కలిసి ఎమ్మార్పీఎస్ ఆందోళనలు ఉధృతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి మాదిగ, నాయకులు అంజయ్య, యాదయ్య, రామయ్య, బీజేపీ నాయకులు మహేష్, పెంటయ్య, మహేష్ మాదిగ, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై వర్క్‌షాప్



క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరియల్ ప్రొడక్షన్ ఇన్ ఫారెస్ట్ నర్సరీ వర్క్‌షాప్‌లో రైతులు, అధికారులు

సుభాష్‌నగర్: అటవీ జాతి మొక్కలను పెంచడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకునే అవకాశం ఉంటుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. దూలపల్లిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ సెంటర్‌లో 'క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరియల్ ప్రొడక్షన్ ఇన్ ఫారెస్ట్ నర్సరీ' అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్(ఎంఓఈఎఫ్‌సీసీ)ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి రైతులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశంలో టింబర్‌కు చాలా డిమాండ్ ఉండటంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఇందు కోసం విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చిస్తున్నామన్నారు. దేశంలో ఎంతగానో ప్రసిద్ధి చెందిన శ్రీగంధాన్ని సైతం నేడు ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. పామాయిల్ మొక్కలను కూడా దిగుమతి చేసుకుంటున్నామని, మన వద్దనే మొక్కలను తయారు చేసుకోవాలంటే క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరియల్ అవసరం చాలా ఉందన్నారు. బై బ్యాక్ అగ్రిమెంట్ ద్వారా కంపెనీలు రైతులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నాయని, తద్వారా నాణ్యమైన కలపను ఇక్కడే పొందవచ్చన్నారు. టేకు, వెదురు, సరుగుడు, మహాగని వంటి కలపజాతి మొక్కలకు తెలంగాణ వాతావరణం చాలా అనుకూలమని, శ్రీగంధం ఎర్రచందనం వంటి లాభదాయకమైన మొక్కలను పెంచడం ద్వారా రైతులు మంచి ఆదాయాన్ని పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైంటిస్టులు డాక్టర్ ఎస్.పట్నాయక్, డాక్టర్ పంకజ్ సింగ్, డాక్టర్ శివప్రసాద్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ ప్రజావాణిలో 9 ఫిర్యాదులు

చింతల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరిస్తున్నామని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ మాధవి అన్నారు. కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో 9 ఫిర్యాదులు వచ్చాయి. లోప్రెషర్‌పై మూడు, భూగర్భ డ్రైనేజీపై మూడు, బోర్వెల్ మరమ్మతులకు రెండు, తాగునీటిలో కలుషిత జలాల సరఫరాపై ఒక ఫిర్యాదు వచ్చింది. అదేవిధంగా జీడిమెట్ల డివిజన్ వైష్ణోయ్ ఎన్‌క్లేవ్‌లో నూతనంగా భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ వేయాలని, గతంలోనే నూతన పైప్‌లైన్ కోసం ఫిర్యాదు చేశామని ఆ కాలనీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాకేష్ తదితరులు జీఎం మాధవికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీజీఎంలు మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న పారిశుద్ధ్య సిబ్బంది

సుభాష్‌నగర్: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్న సేవలు ఎనలేనివని గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అన్నారు. గాజులరామారం వెంకటేశ్వర గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 188 మంది పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ మమత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎన్‌టీఆర్ నగర్‌లోని ఉత్కార్ లక్ష్మి(49) ఇటీవల కల్తీకల్లు తాగి ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిశ్చార్జ్ అయ్యింది. ఇంటికి వచ్చాక ఫిట్స్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఖాజా, రాములుగౌడ్, రాజు, స్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

- బీజేపీ నేత ఎస్.మల్లారెడ్డి



ట్రైబల్ శాఖకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మల్లారెడ్డి

దుండిగల్: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. గండిమైసమ్మ–దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలోని సర్వే నంబరు 120/11లోని 2.20 ఎకరాల స్థలాన్ని గతంలో రెవెన్యూ అధికారులు గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించారు. సదరు స్థలంలో ఇటీవల కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న మల్లారెడ్డి సోమవారం సదరు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న అక్రమాలను రెవెన్యూ అధికారులు వెంటనే తొలగించాలని, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు హాస్టళ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పొజిషన్‌లో ఉన్న పేద ప్రజలకు ఇతర ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, డి.సీతారాం రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బలగారి వీరేశ్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద ప్రజలకు కొండంత అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇటీవల అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన జి.నర్సయ్య, జరిపేటి బ్రమేశ్వర్, వీర్ల సువర్ణ, జాలిం పవన్, ఎండీ బషీరుద్దీన్, నక్క సురేష్‌బాబు, కరల కాంత, నగల నాగమణి, జయలక్ష్మి, సంపంగి బాలమణి, టేకులపల్లి అశోక్‌గౌడ్ గతంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి సోయవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో పలువురికి సీఎంఆర్ఆఫ్ చెక్కులను శ్రీశైలంగౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం



కమిషనర్ ఎండీ షబీర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిజాంపేట్ అధ్యక్షుడు ఆశీ యాదయ్య ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎండీ షబీర్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ.ఉమా మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు సరైన సమయంలో జీతాలు రావడంలేదని, మున్సిపల్ అధికారులు, బ్యాంక్ అధికారులకు కొంత సమన్వయ లోపం ఉందన్నారు. తక్షణమే కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు. ఇల్లు లేని కార్మికులకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని, కార్మికులకు కిట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.స్వామి, వి.శ్రీనివాస్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఐవీఎఫ్, సరోగసీపై ప్రభుత్వం నిఘా ఉంచాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఏసురత్నం



షాపూర్‌నగర్‌లో సమావేశమైన సీపీఐ నాయకులు

కుత్బుల్లాపూర్: ఐవీఎఫ్, టెస్ట్‌ట్యూబ్‌ల పేరుతో పిల్లలు పుట్టిస్తామని అమాయక దంపతులను మోసం చేస్తున్న ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఏసురత్నం అన్నారు. షాపూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని సృష్టి ఫర్టిలైటీ సెంటర్‌లో వేరే వారి డీఎన్ఏతో సరోగసీతో ఐవీఎఫ్ చేశారని, తల్లిదండ్రులు డీఎన్ఏ టెస్ట్ చేయించడంతో బాగోతం బయట పడిందన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదని అన్నారు. అక్రమ పద్ధతుల్లో సరోగసీ, ఐవీఎఫ్‌లు నిర్వహిస్తున్న సెంటర్లపై కఠినంగా వ్యవహరించాలని, వైద్య సేవలు అందించకుండా వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

వైకుంఠధామానికి 3.20 ఎకరాలు కేటాయించాల్సిందే..

- ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు



ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో 2017, 2020 కలెక్టర్/ఆర్డీఓ ఉత్తర్వుల ప్రకారం హిందూ వైకుంఠధామానికి 3.20 ఎకరాలు కేటాయించకుండా 1.20 ఎకరాలు కేటాయిస్తామన్న రెవెన్యూ అధికారుల వైఖరికి నిరసనగా ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఆకుల సతీష్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ మూడు గ్రామాలకు కలిపి వైకుంఠధామం కోసం 10ఎకరాల స్థలాన్ని 2017 అప్పటి కలెక్టర్ కేటాయించారన్నారు. 10 ఎకరాల వైకుంఠధామంలో హిందువులకు 3.20 ఎకరాలు, ముస్లింలకు 3.20 ఎకరాలు, క్రిస్టియన్లకు 3.20ఎకరాలు కేటాయిస్తూ 2020లో ఆర్డీఓ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు హిందువుల వైకుంఠధామం కోసం ఎకరం కూడా కేటాయించకపోవడం బాధాకరం అన్నారు. 2023లో ముస్లింల ఈద్గా కోసం 2 ఎకరాలు కేటాయించారని, హిందువులకు కేటాయించకపోవడం హిందువులపై అధికారులకు చిన్నచూపుగా కనిపిస్తోందన్నారు.

ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలి..

వీఎస్ఆర్ విద్యా సంస్థల్లో ప్రభుత్వ భూమి, యుఎల్‌సీ భూమి దాదాపు 11ఎకరాలను ఆక్రమించుకొని చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరారు. వీఎస్ఆర్ కాలేజీ, స్కూల్‌కు సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం 38.11 ఎకరాలు ఉండాలి. కానీ వారి పూర్తి విస్తీర్ణం 52ఎకరాలు ఉండటంపై సర్వే నిర్వహించాలని కోరారు. అరుణ్‌రావు, చందు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తూ..



పూజల్లో భక్తులు

వర్షాలు కురవాలి వానదేవుడా

దుండిగల్‌లో ఘనంగా సహస్ర ఘటాభిషేకం

దుండిగల్: వర్షాలు సమృద్ధిగా కురవాలని, లోక కల్యాణం కోసం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. దుండిగల్‌లోని సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి అనుగ్రహంతో వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు వృద్ధిలోకి రావాలని వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.